క్లుప్తంగా

భోగేశ్వర ఆలయాభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గా భోగేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఈఓ రామానుజన్, ఇన్‌స్పెక్టర్ హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం జరిగింది. సభ్యులుగా శ్రీనివాసులు, బన్నూరు లింగారెడ్డి, శంకర్ రెడ్డి, లక్ష్మీదేవి, ప్రసాద్, పుట్ట మల్లేశ్వరి, అశోక్, మామిళ్లపల్లి శైలజ, సుమంగళి, కళావతి భాయ్, వెంకట సుబ్బమ్మ, ప్రధాన అర్చకులు శ్యామసుందర్ శర్మ వారితో ప్రమాణం చేయించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నివాళి



నివాళులర్పిస్తున్న రాంభూపాల్ రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని కోరటమద్ది గ్రామ సర్పంచ్ నాగేశ్వర రెడ్డి తండ్రి, మాజీ సర్పంచ్ తిరుపం రెడ్డి (75) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దస్తగిరయ్య ఉరుసు ప్రారంభం



దస్తగిరయ్య స్వామి దర్గా

సి.బెళగల్: మండల కేంద్రంలోని కోటవీధిలో దస్తగిరయ్య స్వామి వారి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు, ఆదివారం కిస్తీ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు.

కలశ ప్రతిష్ట



కలశ ప్రతిష్ట పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని వాల్మీకి రామాలయంలో శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కలశాలను ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. అర్చకులు సుదర్శనమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం పట్టాభిరాముడు ఆలయం, వాల్మీకి ఆలయం, నవగ్రహ ఆలయ మండపంపై ప్రతిష్ఠించారు.

వర్షాలతో నష్టపోయిన

రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కురిసిన అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో రైతుల పోరాటాలకు సంబంధించి ముద్రించిన పోస్టర్లను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ...పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చి, ఫసల్ బీమా, వాతావరణ బీమా పథకాలను అమలు చేయాలన్నారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు.

ప్యాక్స్ డెవలప్‌మెంటు విభాగం అధికారిగా రంగనాథ్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి విభాగం అధికారిగా రంగనాథ్ నియమితులయ్యారు. ఈయన ఆప్కాబ్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈయన నాలుగైదు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతవరకు ఈ పోస్టులో పనిచేస్తున్న నహిదా సుల్తాన ఆప్కాబ్ ట్రైనింగ్ సెంటరు ఫ్యాకల్టీగా బదిలీ అయ్యారు.

7న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం

కర్నూలు(అర్బన్): ఈ నెల 7వ తేదీన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏ క్యాంప్‌లోని హార్టికల్చర్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ముగిసిన దసరా మహోత్సవాలు

- ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు వల్లెలాంబ దేవి, కాళికామాతా, కన్యకాపరమేశ్వరీ, రాములవారి ఆలయం, రాములమ్మ, చౌడేశ్వరీదేవి, గంగమ్మ, తులజా భవాని, అంబా భవాని ఆలయాల్లో అమ్మవార్లు బహురూపాల్లో దర్శనమివ్వగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. ఎస్ఎస్‌కె సమాజ్ ఆధ్వర్యంలో మాతా అంబ భవాని ఆలయం నుంచి మహిళలు నవధాన్యాల మొలకలను మోస్తూ గ్రామ పురవీధుల గుండా నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

సి.బెళగల్: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా కొలువుంచిన అమ్మవారి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో అమ్మవార్లకు ప్రజలు 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడమటి ఆంజనేయస్వామి, ఈశ్వరాలయంలోని దుర్గాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారిని, రంగనాథుడి ఆలయంలోని స్వామి వార్లకు గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా దేవతా ఉత్సవ విగ్రహాలకు పల్లకీలో కొలువుంచి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో చిన్నారుల హారతి కార్యక్రమం ఆకట్టుకుంది.



కోడుమూరులో ప్రత్యేక అలంకరణలో అంబా భవాని



కోడుమూరులో మొలకలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం



సి.బెళగల్‌లో అమ్మవారికి పల్లకోత్సవంలో భక్తులు



సి.బెళగల్‌లో దసరా గ్రామోత్సవంలో హారతులతో పాల్గొన్న చిన్నారులు



అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



కళాకారుల నృత్యాలు



రంగులు చల్లుకుంటూ సందడి చేస్తున్న భక్తులు



గడిగిరేవులలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

పాణ్యం: దసరా సందర్భంగా తొమ్మిది రోజుల పాటు విశిష్ట చేసిన అమ్మవారిని చివరి రోజు గురువారం నిమజ్జనంతో ఉత్సవాలు ముగిశాయి. హైందవశక్తి, ఫ్రెండ్స్ యూత్, బీసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా గ్రామ

అంబరం.. నిమజ్జన సంబరం

వీధుల మీదుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. యువకుల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భజన బృందాల మధుర గానాల మధ్య భక్తులు టెంకాలు కొట్టి ముక్కులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వాహకులు పాణ్యం చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవమూర్తుల ఊరేగింపులో అధికారులు పాల్గొన్నారు. మేళతాళాల నడుమ జమ్మిచెట్టు వరకు ఊరేగింపు జరిగింది.

భక్తిశ్రద్ధలతో వసంతోత్సవం

గడివేముల: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గడివేములలో కన్యకాపరమేశ్వ రి అమ్మవారి వసంతోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకురాలు వసంతలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవా రిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్యులు అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించారు. యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బొంతల మధుసూదన గుప్తా, ఉదయగిరి శివయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా మహోత్సవాలు

గడివేముల: విజయదశమిని పురస్కరించుకుని గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గా భోగేశ్వరాలయం, మూల పెద్దమ్మ ఆలయం, బాలాజీ టెంపుల్‌తోపాటు ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గడిగిరేవుల భోగేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. దీంతో దసరా మహోత్సవాలు ముగిశాయి.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

దాయాదుల మధ్య ఘర్షణ

- ఆరుగురికి రక్తగాయాలు

కోడుమూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఆరుగురికి రక్తగాయాలయ్యాయి. కొత్తపల్లెకు చెందిన బావన్న, చిన్న రాముడు వరుసకు అన్నదమ్ముళ్లు. వీరి పిల్లల మధ్య గతంలో చిన్నచిన్న మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. దీంతో గురువారం రాత్రి మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో బావన్నకు చెందిన ముగ్గురు కుమారులు, చిన్న రాముడుకు చెందిన ఇద్దరు కుమారులు ఒకరిపై ఒకరు పట్టుడు కర్రలతో దాడి చేసుకోవడంతో ఆరుగురికి రక్తగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి శుక్రవారం తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు (రూరల్): రోడుడ ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణానగర్‌కు చెందిన దిండుకుర్తి రాధాకృష్ణ (67) కోలుకోలేక మృతిచెందాడు. సొంత పనుల నిమిత్తం ఈ నెల 1న బైక్‌పై దూపాడుకు వెళ్లాడు. తిరుగుప్రయానంలో దిన్నెదేవరపాడు రింగ్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో పడివుండగా హైవే పెట్రోలింగ్ పోలీసులు గమనించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించగా కోలుకోలేక గురువారం మృతి చెందాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

- జిల్లా కలెక్టర్ సిరి
- వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

కల్లూరు: రైతులు ఉపయోగించే వ్యవసాయ ఉపకరణాలు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు ప్రయోజనం కలిగించే విధంగా జీఎస్టీ తగ్గింపు జరిగిందన్నారు. నిత్యావసర సరుకులతో పాటు వ్యవసాయ పరికరాలు, కార్లు, బైక్‌లు, ట్రాక్టర్‌లపై కూడా జీఎస్టీ తగ్గిందని తెలిపారు. దుకాణదారులు పాత రేట్లకు అమ్మితే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నిత్యావసర సరుకులపై జీఎస్టీ తగ్గడం వల్ల ప్రతి నెలా కుటుంబానికి రూ.1000 ఆదా అవుతుందన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ మీద కూడా జీఎస్టీ తగ్గించారని.. ప్రజలందరూ హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు.

పంట మార్పిడితో ఉత్తమ ఫలితాలు

రైతులు ఒకే తరహా కాకుండా రెండు, మూడు రకాల పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా పురుగుమందులు ఎక్కువగా వాడకుండా సహజ వ్యవసాయం చేయాలన్నారు. లైవ్‌స్టాక్ మిషన్ కింద లోన్లు తీసుకుని పశు పోషణతో ఆదాయం పెంచుకోవాలన్నారు. జిల్లాలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, పిల్లలను చదివించాలన్నారు. బ్రిడ్జి నిర్మించాలని, డ్రైనేజీలు శుభ్రం చేయించాలని, తదితర సమస్యలను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాల స్టాళ్లను కలెక్టర్, ఎమ్మెల్యే తిలకించారు. జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపీ ఎంఐపీ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎడ్ల బండిని ఢీకొన్న ఆర్‌టీసీ బస్సు

- నలుగురికి గాయాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు – కర్నూలు రోడ్డుపై పెంచికలపాడు గ్రామ సమీపంలో ఎడ్ల బండిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన రైతు ఉప్పరి గోరంట్ల పత్తి బస్తాలను ఎడ్ల బండిపై వేసుకుని మస్తానమ్మ, దానమ్మ, వినోద్‌లతో కలిసి ఇంటికి బయలుదేరాడు. పెంచికలపాడు వద్దకు రాగానే కోడుమూరు నుంచి కర్నూలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎడ్ల బండిని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదంలో రైతు గోరంట్ల, మస్తానమ్మ, దానమ్మ, వినోద్‌లకు రక్త గాయాలు కాగా విశ్వభారతి హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం నుంచి ఎద్దులు సురక్షితంగా బయటపడగా, బండి నుజ్జునుజ్జు అయింది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): దోమల నివారణకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. శుక్రవారం స్థానిక తెలుగుగేరిలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలు వర్షాకాలంలో వృద్ధి చెందుతాయని, తద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లోకి దోమలు రాకుండా సాయంత్రం వేళ తలుపులు మూసి ఉంచాలని, దోమ కాటు నుంచి రక్షణ కోసం తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



నీటి తొట్టిలో లార్వాలను పరిశీలిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

గాంధీ జయంతి వేడుకలు

కల్లూరు: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నగేష్, మండల పరిపాలన అధికారి నాగరాజు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు.



కల్లూరు: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సామ నాటకానికి అవార్డులు

కర్నూలు (కల్చరల్) : తెనాలిలో నిర్వహించిన వీణ అవార్డ్స్ పద్యనాటిక పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం వారి జగదేక సుందరి సామ నాటకానికి అవార్డులు వరించాయి. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకు కళల కాణాచి తెనాలిలో ప్రదర్శించిన సామ నాటకానికి అవార్డులు లభించాయని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ఆయన దర్శకత్వంలో 30వ తేదీన ప్రదర్శించిన జగదేక సుందరి సామ పద్య నాటకానికి ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ఉత్తమ హాస్య నటిగా బి.హసీనా వీణ అవార్డులను అందుకున్నారన్నారు. వారిని కళాక్షేత్రం అధ్యక్షుడు, ఇతర కళాకారులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : ఈ నెల 4 నుంచి 6 వరకు విశాఖపట్నంలోని నర్సీ పట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని సోహెయిల్ ఎలక్ట్రికల్ అధినేత సోహెయిల్ అన్నారు. శుక్రవారం ఏ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్ ప్రాంగణంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్, ఉమ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 4న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బి.రోడ్డు, బాబా బృందావన్ నగర్, మురారినగర్, వాసవీ నగర్ ఏరియాల్లో విద్యుత్ కోత ఉంటుందని, ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిర్దేశించిన కాల వ్యవధిలో అభివృద్ధి పనులు పూర్తి కావాలి

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలో గుర్తించిన అస్పిరేషనల్ బ్లాకుల్లో అభివృద్ధి పనులను నిర్దేశించిన కాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి నీతి అయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యంకు వివరించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆస్పిరేషనల్ బ్లాక్‌ల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. అందులో భాగంగా చిప్పగిరి మండలంలో జరుగుతున్న పనులను కలెక్టర్ వివరించారు. చిప్పగిరి మండలానికి రూ.1.50 కోట్లు కేటాయించారని, ఇందులో రూ.35 లక్షలతో అంగన్‌వాడీలు, 95 లక్షలతో మంచినీటి సమస్యలు, 20 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఓ భారతి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ పాల్గొన్నారు.

పోప్ లియోను కలిసిన కర్నూలు బిషప్

కర్నూలు (టౌన్) : ప్రపంచ ఆధ్యాత్మికవేత్త, క్యాథలిక్ సమాజానికి జగద్గురువు పోప్ లియో ను కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నే ష్ (కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లాలు) గురువారం కలిశా రు. వాటికన్ సిటీ 14వ పోప్ లియోగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పోప్‌ను కలసినట్లు కర్నూలు బిషప్ వెల్లడించారు. దయాసిస్ సమగ్రాభివృద్ధిలో వాటికన్ తన పాత్ర పోషిస్తుందని తెలియజేసినట్లు బిషప్ వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు త్వరగా పరిహారం

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్) : ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు పరిహారం త్వరితగతిన మంజూరు చేయాలని, ప్రతి నెల ఖచ్చితంగా సివిల్ రైట్ డే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 2013 నుంచి 2025 వరకు పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను పోలీసు అధికారులతో సమీక్షించారు. ప్రతి నెల ఖచ్చితంగా సివిల్ రైట్ డే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలను కలెక్టర్ ఆదేశించారు. హత్య కేసులకు సంబంధించి బాధితులకు ఇంటి స్థలం, ఉద్యోగం త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాల పరిహారానికి సంబంధించి పెండింగ్ ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని, అదే విధంగా శ్మశాన వాటికలు అవసరమైన చోట ప్రతిపాదనలు నెల లోపు పంపాలని సబ్ కలెక్టర్, ఆర్డీఓలను ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కింద నిధులు ఎంత ఖర్చు పెట్టారో వివరాలు ఇవ్వాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసే సమయంలో వాస్తవాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ బీసీలకు సంబంధించిన యాక్ట్ సరిగా అమలయ్యే విధంగా ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరారు. డీవీఎంసీ మెంబర్లు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై దృష్టి సారించామన్నారు. సమావేశంలో కర్నూలు ఆర్డీఓ సందీప్, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి బి.రాధిక, డీవీఎంసీ సభ్యులు సురేంద్ర, రవికుమార్, సురేష్, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మద్దిలేటి, కురువ మద్దిలేటి, మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల గుర్తింపులో జాప్యం ఎందుకు?



మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్) : పదే పదే చెబుతున్నా.. ఎందుకు అక్రమ నిర్మాణాలను గుర్తించడంలో జాప్యం చేస్తున్నారని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి సచివాలయం పరిధిలో ప్లానింగ్ కార్యదర్శులు, అమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులతో కలిసి అక్రమ నిర్మాణాలను గుర్తించాలన్నారు. ఎల్ఆర్ఎస్ పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీసీపీ వెంకటరమణ, అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి ప్రభోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో కొండపై వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి మనుషులు మోసే ప్రభోత్సవం వేలాది మంది భక్తుల హర్షధ్వానాల మధ్య గురువారం తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు అత్యంత వైభవంగా జరిగింది. దసరా వేడుకలు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి ఏవిధంగా తొమ్మిది రోజులు పూజలు చేస్తారో ఇక్కడ చెన్నకేశవస్వామికి ఆదేవిధంగా పూజలు చేయటం ఆనవాయితీ. ప్రభోత్సవానికి కందనాతి, మసీదపురం, వెంకటగిరి, మాచుమాన్ దొడ్డి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున చెన్నకేశవస్వామి విగ్రహాన్ని ప్రభపై కొలువుంచి నాలుగు వైపులా నాలుగు గ్రామాల ప్రజలు ప్రభను మోశారు. కొండపై నుంచి కిందకు స్వామిని తీసుకువచ్చే ప్రయత్నంలో అవస్థలు పడ్డారు. మిద్దెలపై నుంచి పెద్ద పెద్ద తాళ్లు కట్టి విగ్రమహోత్సవం కిందకు పడకుండా జాగ్రతలు పడినా.. మిద్దెలపైకి ప్రభ వంగింది. గ్రామ పొలిమేరలోని జమ్మి చెట్టు దగ్గరకు తీసుకెళ్లి పూజలు చేసి మరలా స్వామి విగ్రమహోత్సవాన్ని కొండ మీదికి చేర్చే సమయంలో పలుసార్లు విగ్రహమహోత్సవం పక్కకు పడింది.

ప్రభోత్సవంలో అపశృతి

విగ్రహామహోత్సవాన్ని కొండపైకి చేర్చే క్రమంలో ప్రభ పక్కకు వంగిపోవడంతో మాసుమాన్‌దొడ్డికి చెందిన వడ్డే తిమ్మప్ప, వడ్డే వీరేష్, కందనాతికి చెందిన కొరివి రవి, కెలన్న వెంకటేష్‌లకు స్వల్ప గాయాలు కాగా, వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ ఈశ్వర్‌కు భుజం ఫ్యాక్చర్ కావడంతో మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తరలించారు.



ఆకట్టుకున్న యువకుల విన్యాసాలు

మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో దసరా పండగను పురస్కరించుకొని శుక్రవారం యువకులు కర్రసాము, పల్టీలు కొట్టడం, కర్రకు కుర్చీ కట్టుకొని బాలుడిని తలకిందులుగా తిప్పటం వంటి విన్యాసాలు ప్రదర్శించారు. అయితే ప్రతి సంవత్సరం చేసిన మాదిరిగా ఈసారి సాహస విన్యాసాలు చేయటానికి యువకులు ఉత్సాహం చూపలేదని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్న చిన్న విన్యాసాలు చేసి సంబరం చేసుకున్నారు.